నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 30 ఏప్రిల్ 2025 | HYDERABAD


## ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు జ్యూస్‌లు



ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, హోంగార్డులకు డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సురేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు అంబర్ పేట అలీకేఫ్, చేనంబర్, గోల్నాక, తిలక్ నగర్, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో కూల్ వాటర్, జ్యూస్, సంత్ర పండ్లు, కీరదోసను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులకు ట్రాఫిక్ పోలీసులు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు ఆర్కే బాబు, రేడపాక రాము, సాయి ప్రసాద్, మహేశ్ పాల్గొన్నారు.

## చెరువులో పడి చిన్నారి మృతి

ఎల్బీనగర్, ఏప్రిల్ 29: ఆడుకుంటూ వెళ్లి సరూర్‌నగర్ చెరువు లో పడి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు కు చెందిన పాలకుర్తి శ్రీను, భార్య శ్రావణి సరూర్‌నగర్ లోని చెరువుకట్టకు అనుకోని ఉన్న గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నం.14లో నివసిస్తున్నారు. నలుగురు సంతానం కాగా రెండో పాప అభిత (6) సోమవారం మధ్యాహ్నం తల్లి దండ్రులు ఇంటి పక్కన వారితో మాట్లాడుతూ ఉండగా పాప గుడిసె పక్కన గల చెట్టు కింద ఆడుకుంటూ ఉన్నది. కొద్దిసేపటి తర్వాత పాప అక్కడ కనిపించక పోవడంతో చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళ వారం ఉదయం పాప సరూర్‌నగర్ చెరువులో తేలుతూ కనిపించగా బయటకి తీయగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



అభిత

# హైదరాబాద్.. ఆగమాగం!

## ఏడాదిన్నరలోనే నగర పాలన అస్తవ్యస్తం

- కీలక విభాగాల్లో కుదురుకోని అధికారులు
- జీహెచ్ఎంసీలో 4 సార్లు కమిషనర్ల మార్పు
- హెచ్ఎండీఏలో ప్రభుత్వం విఫల ప్రయోగాలు
- బ్రహ్మ పదార్థంగా గ్రేటర్ కార్పొరేషన్ విస్తరణ
- హెచ్ఎండీఏ పరిధిలోనే ఫ్యూచర్ సిటీ ఏర్పాటు
- మహానగర విస్తరణ పరిధుల్లో సర్కారు బంతాట!
- ప్రజాపాలనలో గతి తప్పిన మాస్టర్ ప్లాన్
- మూలిగే 'రియల్' రంగంపై దిశలేని నిర్ణయాలు





రోనాల్డ్ రాస్



ఆమ్రపాలి



ఇలంబర్తి



ఆర్‌వీ కర్ణన్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): చార్ సౌ సాల్‌కా షహర్! దినదిన ప్రవర్ధమానమై.. నాడు ఉమ్మడి రాష్ట్రమైనా, నేడు తెలంగాణకైనా ఆర్థిక ఇంజిన్‌లా మారిన హైదరాబాద్, దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే ధీటుగా ఎదిగి విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్నది. గుండెకాయలాంటి ఈ నగర విస్తరణలో ఒక స్పష్టమైన విజన్‌తో ముందుకు సాగాల్సిన రాష్ట్ర ప్రభుత్వానికి దశదిశ లేకుండా పోయిందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను విస్తరిస్తామంటూ రేవంత్ సర్కారు మొదలుపెట్టిన ప్రతిపాదనలు ఇప్పుడు ఏ మార్గంలో ఎటు వెళ్తున్నాయో అధికారులకే అంతుబట్టడం లేదు. ముఖ్యంగా కేసీఆర్ హయాంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతుల కల్పన శరవేగంగా సాగుతున్న తరుణంలో వచ్చిన రేవంత్ ప్రభుత్వం అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్‌లా తయారైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు బలాన్ని చేకూర్చేలా మహానగరానికి ఆయువుపట్టులాంటి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వంటి కీలక విభాగాల్లో ఏడాదిన్నరగా ఒక్క అధికారి సైతం కుదురుగా ఉన్న దాఖలాల్లేవు. తాజాగా రెండు రోజుల కిందట మరోసారి అధికారుల బదిలీలు, విస్తరణలోని మార్పులు ఇప్పటికే కుదేలైన రియల్–నిర్మాణ రంగాలపై మరో పిడుగులా మారనున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### ఎట్లుండె హెచ్ఎండీఏ..ఎట్లయింది!

కేసీఆర్ హయాంలో కళకళలాడిన హెచ్ఎండీఏ ఇప్పుడు అత్యంత దీనస్థితిలోకి వెళ్లిపోయింది. రియల్–నిర్మాణ రంగాలు పడిపోవడంతో నెలకు రూ.120 కోట్లకు పైగా వచ్చే ఆదాయం సగానికంటే తక్కువగా రూ.50 కోట్ల లోపునకు పడిపోయింది. ఒకప్పుడు ప్లాట్ల వేలంపాటల్లో రికార్డులు సృష్టించి ఏటా వేల కోట్ల రూపాయల లింకు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను దిగ్విజయంగా పూర్తి చేసిన హెచ్ఎండీఏ ఏడాదిన్నరలో సికింద్రాబాద్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు శంకుస్థాపన మినహా ఒక్కటంటే ఒక్క పని కూడా భుజాన వేసుకొని పూర్తి చేసిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేనాటికి హెచ్ఎండీఏ కమిషనర్‌గా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న దానకిశోర్ వ్యవహరించారు. రేవంత్ ప్రభుత్వం ప్రత్యేకంగా జాయింట్ కమిషనర్ (జేసీ) పోస్టును సృష్టించి ఆ బాధ్యతలను ఆమ్రపాలికి అప్పగించింది. కొన్నాళ్లకే ఆమెకు మూసీ, గ్రోత్ కారిడార్ బాధ్యతలు అప్పగించి జేసీగా శ్రీవాత్సవను తీసుకొచ్చింది. కొంతకాలానికి హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించింది.

### మౌలిక వసతుల కల్పనలో పెద్ద చిక్కుముడి

ఉప్పల్ నుంచి నారపల్లి వరకు కేంద్ర ప్రభుత్వం ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టి కొనసా...గిస్తున్నది. పనులు జరిగే చోట రహదారి గుంతలతో అస్తవ్యస్తంగా తయారై జనం ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. ఆ గుంతలను పూడ్చాలంటే జీహెచ్ఎంసీ అధికారులేమో అవి తమ పరిధిలోకి రావని, ఆర్‌అండ్‌బీ అయినందున వాళ్లే చూసుకోవాలని చెప్తున్నారు. ఆర్‌అండ్‌బీ ఆ చిన్న పనులు తామెలా చేస్తామని చేతులెత్తేశారు. కాగితాలపై గీసే అధికారిక హద్దులతో క్షేత్రస్థాయిలో వచ్చే నిర్వహణలో ఎన్ని చిక్కుముడులు ఉంటాయనేందుకు మచ్చుకు ఇదో ఉదాహరణ మాత్రమే! రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ వరకు హద్దును నిర్ణయించుకొని మాస్టర్‌ప్లాన్– 2051ని రూపొందించేందుకు నిర్ణయించింది. కానీ ట్రిపుల్ ఆర్ పరిధి వరకు అధికారికంగా అనేక విభాగాల సరిహద్దులున్నాయి. ఈ నేపథ్యంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను చేపట్టడంలో క్షేత్రస్థాయిలో రోజువారీగా వచ్చే చిక్కుముడులను ఆయా విభాగాలు సమన్వయంతో కలిసి పరిష్కరించడం సవాల్‌గా మారుతుందని ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోనే కార్పొరేషన్, జలమండలి, హైడ్రా, ట్రాఫిక్ విభాగం.. ఇలా వీటి మధ్యనే సమన్వయంలేక అనేక సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్న తరుణంలో ప్రణాళికాబద్ధంగా లేని ఈ అధికారిక గీతలతో మరెన్ని చిక్కులొస్తాయోనన్న అంశంపై ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరమున్నదని సదరు అధికారి సూచించారు.

### గాడితప్పిన జీహెచ్ఎంసీ

రేవంత్ ఏడాదిన్నర పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా ప్రారంభించ లేదు. ఒక్క ప్రణాళికను కూడా పూర్తిస్థాయిలో అమలు చేసింది లేదు. కీలక విభాగాల్లో అధికారులను కుదురుగా ఉంచకుండా వరుస బదిలీలు చేస్తుండటం మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నది. (జీహెచ్ఎంసీ కమిషనర్ కుర్చీలో ఏడాదిన్నరలోనే నలుగురు మారారు. ఈ ప్రభుత్వం వచ్చేనాటికి ఉన్న రోనాల్డ్ రాస్‌ను దాదాపు మూడు నెలలకే బదిలీ చేసింది. ఆయన స్థానంలో హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు ఇచ్చిన ప్రభుత్వం కొన్నిరోజులకే పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. క్యాట్ ఆదేశాలతో ఆమె ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడంతో మరో నాలుగు నెలల్లో ఆమ్రపాలి స్థానంలో ఇలంబర్తిని తెచ్చిపెట్టింది.

కమిషనర్‌గా ఇలంబర్తి కుదురుకునే సమయంలోనే ఏడు నెలల్లోపే ఆయనను బదిలీ చేసి ఆర్వీ కర్ణన్‌కు బాధ్యతలు అప్పగించింది. ఏడాదిన్నరలో ముగ్గురు కమిషనర్లు పోయి నాలుగో అధికారి వచ్చారంటే సరాసరి ఒక్కో అధికారి ఐదు నెలలు కూడా సరిగా ఉండలేదు. సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాలు నగరాభివృద్ధిపై స్పష్టమైన ప్రభావాన్ని చూపాయనేందుకు ఏడాదిన్నరగా కుంటుపడిన అభివృద్ధిని చూస్తే అర్థమవుతుంది. కేసీఆర్ హయాంలో పూర్తి చేసిన మౌలిక వసతులకు కొన్నింటికి రిబ్బన్ కట్ చేయడం మినహా ఈ ప్రభుత్వం ఒక్క పనీ మొదలుపెట్టలేదు.

### విస్తరణ పరిధుల్లో సర్కారు బంతాట!

కీలక విభాగాల్లో అధికారుల బదిలీల తీరు ఇలా ఉంటే.. రేవంత్ ప్రభుత్వం హైదరాబాద్ మహానగర విస్తరణలో తెరపైకి తెచ్చిన, అమలు చేస్తున్న ప్రతిపాదనలు మరో గందరగోళానికి దారి తీస్తున్నాయి.

- అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరాన్ని న్యూయార్క్ సిటీలా, జపాన్‌లోని టోక్యో నగరంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనలేవీ కార్యరూపం దాల్చలేదు. ఏడాదిన్నరలో కనీసం మాస్టర్ ప్లాన్ ముసాయిదా కూడా విడుదల చేయలేదు.

> తొలుత జీహెచ్ఎంసీని ఔటర్ రింగురోడ్డు వరకు విస్తరిస్తామంటూ పల్లవి అందుకున్న సర్కారు పెద్దలు.. దాన్ని నాలుగు ముక్కలు చేస్తాం, రెండు ముక్కలు చేస్తామంటూ లీకులిచ్చారు. జీహెచ్ఎంసీ చుట్టూ ఔటర్ లోపల ఉన్న స్థానిక సంస్థల (కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు) పాలకవర్గం గడువు ముగియగానే ప్రత్యేకాధికారుల పాలన తీసుకువచ్చింది. ఈలోగా ఔటర్ లోపల ఉన్న పంచాయతీలను ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో విలీనం చేసింది.

- ఔటర్ రింగు రోడ్డు వరకు ఉన్న ప్రభుత్వ ఆస్తులు, నీటి వనరుల పరిరక్షణ పేరిట ప్రభుత్వం జీవో 99 ద్వారా తెచ్చిన హైడ్రా పరిధిని ఔటర్ రింగు రోడ్డు సరిహద్దుగా నిర్ధారించింది.

> హెచ్ఎండీఏ పరిధి 7,257 చదరపు కిలోమీటర్లు ఉండగా.. ట్రిపుల్ ఆర్ సరిహద్దుగా లోపల రెండు కిలోమీటర్ల వరకు ప్రాంతాన్ని ఆ సంస్థ పరిధిలోకి తెచ్చారు. దీంతో హెచ్ఎండీఏ పరిధి 10,472 చదరపు కిలోమీటర్లకు పెరిగింది.

- అనంతరం తాను నాలుగో నగరాన్ని సృష్టిస్తానంటూ బేగరి కంచె వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన మేరకు ఫ్యూచర్ సిటీ పేరిట మరో అథారిటీని ఏర్పాటు చేశారు. ఔటర్–ట్రిపుల్ ఆర్ మధ్యలోనే 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేసి ఐఏఎస్ శశాంకకు బాధ్యతలు అప్పగించారు.

> రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టుగా చెప్పుకునే ఫ్యూచర్ సిటీకి అత్తెసరు నిధుల కేటాయింపులే జరిగాయి. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ, ఏఐ సిటీ పేరిట ఒకే నగరంలో మరెన్నో నగరాలను తీర్చిదిద్దుతామని చెప్పి.. బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకొన్నది.

- నిన్నటిదాకా రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలకు సంబంధించి జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, సీడీఎంఏ ఉండేవి. జీహెచ్ఎంసీ వరకు గ్రేటర్ కమిషనర్, హెచ్ఎండీఏకు మెట్రోపాలిటన్ కమిషనర్, గ్రేటర్ అవతల ఉండే పట్టణ పాలనా వ్యవహారాలకు సంబంధించి పురపాలక కమిషనర్, డైరెక్టర్ పరిధిలో కార్యకలాపాలు కొనసాగేవి. ఇప్పుడు సీడీఎంఏను రెండు ముక్కలు చేశారు. జీహెచ్ఎంసీ అవతల హెచ్ఎండీఏ సరిహద్దు వరకు ఉన్న పట్టణ స్థానిక సంస్థలను ఒక విభాగంగా ఏర్పాటు చేసి దానికి పురపాలక శాఖ కార్యదర్శిగా ఇలంబర్తికి బాధ్యతలు అప్పగించారు. హెచ్ఎండీఏ అవతల ఉన్న పట్టణ స్థానిక సంస్థలను ఒక విభాగంగా పరిగణించి మునుపటి సీడీఎంఏగా ఉన్న శ్రీదేవి పరిధిలోకి తీసుకొచ్చారు.

> జలమండలి పరిధిలోనూ ఇప్పటికీ అయోమయమే! ఔటర్ వరకు మంచి నీటి సరఫరా బాధ్యత జలమండలి నిర్వహిస్తుండగా జీహెచ్ఎంసీ అవతల ఉండే పట్టణ స్థానిక సంస్థల్లో మురుగు నీటి వ్యవస్థను ఆయా స్థానిక సంస్థలే నిర్వహిస్తున్నాయి.

- అనేకసార్లు సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో 'తెలంగాణను మొత్తం మూడు రకాలుగా విభజించాలి.. ఔటర్ వరకు పట్టణం, ఔటర్–ట్రిపుల్ ఆర్ పాక్షిక పట్టణం (సెమీ అర్బన్), ట్రిపుల్ ఆర్ తర్వాత గ్రామీణం' అని చెప్పారు. కానీ ఏడాదిన్నరగా పురపాలన వ్యవస్థలో ప్రభుత్వం అధికారికంగా నిర్ధారిస్తున్న సరిహద్దులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉండటం గమనార్హం.

రేవంత్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో అక్షయపాత్రలాంటి హైదరాబాద్ ఆర్థిక ఇంజిన్ అస్తవ్యస్తంగా మారింది. ఏడాదిన్నరలో రాష్ట్ర ప్రభుత్వం ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది లేదు. ఒక్కటంటే ఒక్క ప్రణాళికను కొసదాకా అమలు చేసింది లేదు. పైపెచ్చు కీలక విభాగాల్లోనే అధికారులను కదురుగా ఉంచకుండా వరుస బదిలీలతో మరింత గందరగోళాన్ని సృష్టిస్తున్నది.

> గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ కుర్చీలో ఏడాదిన్నరలోనే నలుగురు మారారు. కాంగ్రెస్ వచ్చాక ముగ్గురు కమిషనర్లు పోయి నాలుగో అధికారి వచ్చారంటే సరాసరిన ఒక్కో అధికారి 5 నెలలు కూడా ఉండటం లేదు.

ఇక కేసీఆర్ హయాంలో ఆర్థికంగా, అభివృద్ధి పనుల పరంగా కళకళలాడిన హెచ్ఎండీఏ ఇప్పుడు అత్యంత దీనస్థితిలోకి వెళ్లిపోయింది. రియల్–నిర్మాణ రంగాలు పడిపోవడంతో నెలకు రూ.120 కోట్లకు పైగా వచ్చే ఆదాయం సగానికంటే తక్కువగా.. అంటే రూ.50 కోట్ల లోపునకు పడిపోయింది. ఒకప్పుడు ప్లాట్ల వేలంపాటల్లో రికార్డులు సృష్టించి ఏటా వేల కోట్ల రూపాయల లింకు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను దిగ్విజయంగా పూర్తి చేసిన హెచ్ఎండీఏ ఏడాదిన్నరలో సికింద్రాబాద్ ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన మినహా ఒక్కటంటే ఒక్క పని కూడా భుజాన వేసుకొని పూర్తిచేసిన దాఖలాల్లేవు.

మహానగరంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను చేపట్టడంలో క్షేత్రస్థాయిలో వచ్చే చిక్కుముడులను ఆయా విభాగాలు సమన్వయంతో కలిసి పరిష్కరించడం సవాల్‌గా మారింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలోనే కార్పొరేషన్, జలమండలి, హైడ్రా, ట్రాఫిక్ విభాగం.. ఇలా వీటి మధ్యనే సమన్వయంలేక అనేక సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



## బల్దియా కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్

### బాధ్యతల స్వీకరణ

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల జరిపిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆర్‌వీ కర్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీపై వెళుతున్న కమిషనర్ ఇలంబర్తి నుంచి కర్ణన్ అధికారికంగా జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సేవలందించిన ఆర్‌వీ కర్ణన్ హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్ క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించి ప్రజల్లో ఆహార భద్రతపై అవగాహన పెంచారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కొనసాగిన ఇలంబర్తి తన పదవీ కాలంలో నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదలకు పలు కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం ఆయన పురపాలక శాఖ కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి)గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్, బదిలీపై వెళ్లిన ఇరువురికి ఉద్యోగులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

## స్టాండింగ్ సమావేశంపై ఉత్కంఠ

### చెరువుల పరిరక్షణ ప్రతిపాదనను మళ్లీ చేర్చిన అధికారులు

### గత సమావేశంలో ఎంఐఎం, కాంగ్రెస్‌ల మధ్య చిచ్చు

సిటీబ్యూరో, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. ఎంఐఎం, కాంగ్రెస్ సభ్యుల మధ్య మాటల తుటాలు మళ్లీ పేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం స్టాండింగ్ కమిటీ అంశాల్లో మళ్లీ పదకొండు చెరువులనే పరిరక్షిస్తామని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. ఐతే గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ అంశంలో మేయర్ వర్సెస్ ఎంఐఎం సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడం, మళ్లీ ఆ ప్రతిపాదనలతోనే స్టాండింగ్ కమిటీ ముందుకు రావడం, స్టాండింగ్ కమిటీ సమావేశంలో 8 మంది సభ్యులతో ఎంఐఎం బలంగా ఉండడంపై ఈ అంశం ఆమోదం పొందడంపై ఉత్కంఠ నెలకొంది. వాస్తవంగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయా 13 చెరువుల పరిరక్షణలో టెక్నికల్ కన్సల్టెంట్‌గా నీరి (జాతీయ పర్యావరణ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ)ని నియమించుకుని చెరువుల నీటి నాణ్యతపై ఎప్పటికప్పుడు పరీక్షలు జరపడంతో పాటు ఇరిగేషన్ సమన్వయంతో సంబంధిత చెరువుల ఆక్రమణకు గురి కాకుండా పక్కాగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఇందుకోసం రూ. 55 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఐతే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఎంఐఎం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 13 చెరువులతో పాటు అదనంగా కొన్ని చెరువులను చేర్చాలని పట్టుబట్టారు. ఈ సమయంలో మేయర్‌కు, ఎంఐఎం సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు ఈ ప్రతిపాదనను కమిటీ పక్కన పెట్టింది. ఈ లోగా హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక రావడం, ఫలితాలు వెలువడి కోడ్ ముగియడంతో స్టాండింగ్ కమిటీ సమావేశం ముహూర్తం కుదిరింది.

## సభ సక్సెస్‌తో కాంగ్రెస్ నేతల్లో వణుకు

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 29: వరంగల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్ కావడంతో.. కాంగ్రెస్ నేతల్లో వణుకు మొదలైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎద్దేవా చేశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రజతోత్సవ వేడుకలకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారని.. దేశ చరిత్రలోనే వరంగల్ బీఆర్ఎస్ సభ లాంటి సభ జరగలేదన్నారు. కేసీఆర్ సభ విజయవంతం కావడంతో తట్టుకోలేక.. కాంగ్రెస్ మంత్రులు ఆగమేఘాల మీద ప్రెస్ మీట్‌లు పెట్టి జనాలు రాలేదని, బాహుబలి సెట్టింగ్ అని చెప్పడం సిగ్గుచేటన్నారు. సిగ్గు, శరం ఉంటే సభకు ప్రజలు వచ్చారా లేదో వరంగల్‌లోని మీ కాంగ్రెస్ పార్టీ నేతలని అడిగి తెలుసుకోవాలని విమర్శించారు. 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని 20 హామీలను కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఎన్ని అబద్ధాలు ఆడిన వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.




